# సామాజిక రాజధానిగా భాగ్యనగరం



**నగరానికి వన్నె తెచ్చే**
**ఏ కార్యక్రమానికైనా ప్రభుత్వ చేయూత**
**ఐ.టి. మంత్రి కె.టి.రామారావు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హైదరాబాద్‌ను సామాజిక రాజధానిగా తీర్చిదిద్దాల్సిన అవసరం వుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.టి. రామారావు అన్నారు. ఇందుకోసం తమ ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తుందని ప్రకటించారు. బుధవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన స్కైఫెస్ట్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు వన్నె తెచ్చే ఏ కార్యక్రమాన్ని అయినా ప్రోత్సహించేందుకు తాము ముందుంటామన్నారు. ఇప్పటికే సాంకేతిక, ఐ.టి, పారిశ్రామిక, వైద్య, ఇతర అన్ని ప్రాధాన్యతా కలిగిన రంగాలలో హైదరాబాద్ కీర్తి ప్రతిష్ఠలు గడించిందన్నారు. ఒక సామాజిక కోణంలో స్పృశించి స్కైఫెస్ట్‌ను నిర్వహణకు పూనుకున్న రోటర్‌క్లబ్ నిర్వాహకులను ఆయన అభినందించారు. దీంతో నగరంలో పండుగ వాతావరణం ఏర్పడటం ఖాయమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంతో హైదరాబాద్ స్థాయి కూడా పెరుగుతుందన్నారు. ఉదాత్తమైన ఆశయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కోసం ఏమేమి వసతులు కావాలో అన్నీ సమకూరుస్తామన్నారు. నగరంలో హాట్ ఎయిర్ బెలూన్ ఉత్సవం సెలవు దినాలలో నిర్వహించడం కలిసివచ్చే అంశమని మంత్రి తారక రామారావు చెప్పారు.

కుటుంబాలు కూడా కాదనుకున్న తరుణంలో జీవిత చరమాంకంలో స్పర్శ్ హాస్పిస్ సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలు అందరినీ ఆకట్టుకునేవేనని అన్నారు. వినోదంతో పాటు వివిధ రకాల ఆహారానికి స్కైఫెస్ట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జానపద కళాకారులకు చోటు కల్పించడం పట్ల ఆయన అభినందించారు. సెలవులు వస్తున్నందున విద్యా సంస్థలను బాగా భాగస్వాములను చేయాలని నిర్వాహకులను కోరారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతోనే స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో రోటరీ క్లబ్, స్పర్శ్ హాస్పిస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్పర్శ్ హాస్పిస్ సంస్థ ట్రస్టీ డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పది లక్షల మంది కేన్సర్ రోగులు పెరుగుతున్నారని అన్నారు. జీవితంలో మరణం తప్పదని, అయితే అవసాన దశలో సరైన ఆదరణ వుండాలన్నారు. ఏటా కేన్సర్‌తో 6.8 లక్షల మంది రోగులు మరణిస్తుండటం బాధాకరమైన అవసరమని చెప్పారు. ఇంతవరకు తమ సంస్థ 650 మంది పట్ల ఆదరణ చూపిందని తెలియజేశారు. సంస్థ ప్రతినిధి రామడుగు జగదీష్ మాట్లాడుతూ అయిదు రోజులపాటు స్కైఫెస్ట్ 2015 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్, అట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.